కథ

# 'ప్రైవసీ'

-ఆకెళ్ళ గిరిజ

హరి, గిరి అన్నదమ్ములు. ఇద్దరికీ ఎంతో ఐకమత్యం. సిటీకి వచ్చి ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఉద్యోగాలు వేరువేరు. అసలు వాళ్ళిద్దర్నీ చూసినవాళ్ళు తనువులు వేరుగాని- మనసులు ఒకటే అంటూ, రామ లక్ష్మణుల్లాంటి అన్నదమ్ములు అంటూ ఉంటారు.



హరికి ఈ మధ్యనే పెళ్ళయింది. పెళ్ళయిన వెంటనే సుమ కాపురానికొచ్చేసింది. దాంతో హరి కాస్త పెద్ద ఇల్లు తీసుకున్నాడు. పెళ్ళయినా గిరి అన్నతోటే ఉంటున్నాడు. వదిన సుమ అతన్ని తల్లిలా చూస్తోందని తనే అందరితో అంటూ వచ్చాడు.

గిరిని కూడా త్వరలో ఓ ఇంటివాణ్ణి చేయాలని వాళ్ళ తల్లిదండ్రులు సంబంధాలు చూడ్డం మొదలెట్టారు. అయితే గిరికి సంబంధాలు ఓ పట్టాన కుదరలేదు. కాస్త టైం తీసుకుంది. అన్ని విధాలా అనుకూలమైన సంబంధం కుదిరేసరికి దాదాపు సంవత్సరం పట్టింది.

గిరి భార్య రాధ కాపురానికొచ్చింది. ఈలోగా హరికి ఓ పిల్లాడు పుట్టాడు. ఏడాది వెధవ చూడ్డానికి 'జనముద్దు'గా ఉన్నాడంటుంది వాళ్ళబామ్మ. వాణ్ణి ఎవరూ కిందదించడం లేదు.

గిరి కూడా మరో ఇల్లు తీసుకోకుండా ప్రస్తుతం హరి వాళ్ళ ఇంట్లోనే కాలక్షేపం చేస్తున్నాడు. కిచెన్ పోగా ఉన్న మూడు గదుల్లోనూ రెండు జంటలూ కాపురాలు చేస్తున్నారు.

కాపురానికొచ్చిన రెండు మూడు నెలల వరకూ కలసిమెలసి సుమతో ఉన్న రాధ ఇటీవల ముభావంగా ఉండడం మొదలుపెట్టింది.

ఇంటిపనుల్లో ఓ చెయ్యి వేయడం ఎప్పుడో మానేసింది. అసలు కిచెన్ వైపు తొంగిచూడ్డం కూడాలేదు. ఎంతసేపూ తమ గదిలో నవలలు, మాగజైన్లు ముందేసుకుని కూర్చోడం హాబీగా మార్చుకుంది.

హరి, కొడుకు 'వంశీ' అటు వెళ్ళినా వాణ్ణి పలకరించడం లేదు, ఎత్తుకోడం అయితే ఎప్పుడో మానేసింది.

భార్య ప్రవర్తనలో అంతర్యం గిరికి అర్థంకాలేదు. మరి మెల్లిగా ఏం అర్థమైందో ఏమో, తను కూడా డైరెక్టుగా రాధకి వంత పాడకపోయినా, ఇది వరకటిలా అన్నా వదినలకి ఏ విషయంలోనూ చేదోడు వాదోడుగా ఉండటం, తల్లో నాలుకలా మెసలడం తగ్గించుకున్నాడు.

పెళ్ళయింది కదా! కాస్త వాడూ భార్యపై దృష్టి నిలపాలి కదా! అని సరిపెట్టుకున్నారు హరి, సుమ మొదట్లో!

అయితే రాను రాను గిరి, రాధల ప్రవర్తనతో వాళ్ళు వాళ్ళ అభిప్రాయాల్ని అత్యంత త్వరగా మార్చుకోవల్సిన అవసరం ఏర్పడింది.

ఓ రోజున పసివాడు "వంశీ' బాబాయి రావడం చూసి ఎత్తుకోమని గొడవచేశాడు. గిరి వాడిని పట్టించుకోకుండా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

వంశీ 'బాబాయ్...అచ్‌పోదాం అంటూ కూడా పడ్డాడు. రాధ పసివాణ్ణి అదిరించి, కేకలేసి గది బయట పెట్టేసి తలుపు లేసేసింది.

పసివాడి పట్ల ఎప్పుడూ అలా ప్రవర్తించని గిరి నిర్లిప్తంగా ఉండటం సహజంగా సుమ హరి దంపతులకు మింగుడు పడలేదు.

ఇది జరిగిన రెండ్రోజులకు గిరి డిక్లేర్ చేశాడు "అన్నయ్యా! మేం వేరే వెళ్ళిపోతున్నాం. మా అత్తవారింటికి దగ్గరగా ఒక పోర్షన్ తీసుకున్నాను. పైగా ఇదే మనకి ఇరుకైపోయింది. మాకు అస్సలు ప్రైవసీ ఉండటం లేదు. పైగా తనకి ఇక్కడ ఏమీ తోచట్లేదంటోంది మీ మరదలు

"మంచిదిరా...అలాగే కానీ..." అన్నాడు హరి.

\+ + +

కాలం చూస్తుండగానే రెండేళ్ళు గడిచిపోయాయి. గిరికి ఇప్పుడు ఆడపిల్ల. యేడాది వయస్సు...ఎడం పాటించలేదేమో మళ్ళీ నీళ్ళోసుకుంది రాధ.

రెండు గదుల ఇంట్లో...అలాగే ఇరుకుగా కాలక్షేపం చేస్తున్నారు. ఇప్పుడామెకు ప్రైవసీకి కొదవలేదు.

కానీ నవల్లు చదువుకునే తీరుబడి ఏమాత్రం లేదు. పిల్లతో సతమతమౌతోంది.

'పుట్టింటి వారు దగ్గరే ఉన్నా పట్టించుకోవడంలేదు. ఎందుకంటే రాధ తర్వాత అమ్మాయికి పెళ్ళయి వాళ్ళకు కొత్తల్లుడొచ్చాడు అందుకు. ఆ విధంగా గిరి, రాధల 'ప్రైవసీ'కి లోపం రాకుండా చూడ్డంలో అత్తవారు కూడా సహకరించారు.

'నాలుగేళ్ళ క్రితం పెళ్ళయినప్పుడు మేమూ కొత్త దంపతులమే కదా! అప్పుడు మేం ఇలా 'ప్రైవసీ' కోసం పాకులాడామా! గిరిని మాతో అట్టే పెట్టుకోలేదూ! 'అని హరి, సుమ దంపతులేమాత్రం అనుకోలేదు అదీ కథ!

-ఆకెళ్ళ గిరిజ
ఇ.నం.21-138/3, ప్లాట్ నం.41
ఉత్తంనగర్,నఫిల్‌గూడ,
హైదరాబాద్-47

★